కత్తిమీద సాములా.. పాతబస్తీకి మెట్రో..

- ఆస్తుల సేకరణకే వెయ్యి కోట్లుపైగా..
- బడ్జెట్‌లో ప్రాజెక్టుకు కేటాయించింది రూ. 500 కోట్లే

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): పాతనగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఆస్తుల సేకరణ కత్తిమీద సాముగా మారనుంది. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టకేలకు ఒక అడుగు ముందు పడింది. ఎంజీబీఎస్ నుంచి చార్మినార్, శాలిబండ, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ మేర చేపట్టనున్న మెట్రో రైలు ప్రాజెక్టు కోసం భారీ ఎత్తున ఆస్తులను సేకరించాల్సి వస్తోంది. మెట్రో అలైన్‌మెంట్‌లో ప్రస్తుతం రోడ్డు విస్తీర్ణం చాలా తక్కువ ఉంది. కొన్ని చోట్ల 30-40, మరికొన్ని చోట్ల 60 ఫీట్ల కంటే ఎక్కువ రోడ్డు మార్గం లేదు. దీంతో మెట్రో మార్గాన్ని సాఫీగా నిర్మించాలంటే 80-100 అడుగుల మేర విస్తరించాల్సిన అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో అతి కష్టం మీద పాతనగరంలో మెట్రో ప్రాజెక్టు కోసం 100 ఆస్తుల సేకరణకు ఇటీవల హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ద్వారా భూసేకరణ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మొత్తం 7.5 కి.మీ మేర నిర్మించే పాతనగరం మెట్రో మార్గంలో సుమారు 1100 ఆస్తుల సేకరణ చేపట్టాల్సి ఉన్నదని, ఇందుకోసం రూ.1100 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని మెట్రో అధికారులు తెలిపారు. ప్రతిపాదిత మెట్రో మార్గంలో ప్రస్తుతం ఉన్న రోడ్డు విస్తరణను పరిగణలోకి తీసుకొని ఆస్తులను గుర్తించామని, దీంట్లో చిన్న సైజుల్లో ఇండ్ల ఉండటం వల్ల సేకరించాల్సిన ఆస్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో దశలవారీగా 100-200 ఆస్తులకు ఒక నోటిఫికేషన్ చొప్పున జారీ చేయనున్నారు.

పాతనగరం మెట్రోకు రూ.500 కోట్లే....

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పాతనగరం మెట్రో రైలు ప్రాజెక్టు కోసం కేవలం రూ. 500 కోట్లే కేటాయించింది. ఇప్పటికే శంకుస్థాపన పూర్తి చేసుకున్న పాతనగరం మెట్రోకు సుమారు రూ.2300 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయగా అందులో సగం ఆస్తుల సేకరణే ఖర్చు చేయాల్సి వస్తోంది.

ప్రతి నీటి చుక్కకు.. లెక్క..

- భూగర్భ జలాలు ఇష్టానుసారం కుదరదు
- 'కంటోన్మెంట్' పరిధిలో కఠిన ఆంక్షలు
- వాణిజ్య వినియోగంపై అదనపు చార్జీ వసూలు

కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

మారేడ్‌పల్లి, ఆగస్టు 14: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఇకపై ప్రతి నీటి బొట్టు లెక్క తేలనున్నది. ఇష్టానుసారం భూగర్భ జలాలు వినియోగించడంపై కఠిన ఆంక్షలు అమలు కానున్నాయి. డిగ్గింగ్ అండ్ యూజ్ ఆఫ్ బోర్‌వెల్స్ నిబంధనల ప్రకారం.. ఫిబ్రవరి 23న కంటోన్మెంట్ బోర్డు డ్రాఫ్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తూ...నిబంధల పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే మార్చి 5వ తేదీ లోపు తెలుపాలని సూచించింది. ఇలా వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్న కొత్త నిబంధనలను రూపొందించి బుధవారం అధికారికంగా గేజిట్‌ను విడుదల చేసింది. ఈ గేజిట్ నిబంధనల ప్రకారం....కంటోన్మెంట్ బోర్డు పరిధిలో భూగర్భ జలాల వినియోగంపై పక్కాగా లెక్క తేలేలా అధికారులు పూర్తి స్థాయి చర్యలు చేపట్టనున్నారు. గృహ అవసరాల కోసం, ఆర్మీ, పోలీస్, వ్యవసాయ, చిన్న తరహా సూక్ష్మ పరిశ్రమలకు వినియోగించే బోర్‌వెల్స్‌లను క్రమబద్ధీకరణ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. అలాగే వాణిజ్య సంబంధిత పరిశ్రమలకు వినియోగించే నీటికి 50 లీటర్ల కంటే ఎక్కువ నీటిని తోడితే ప్రతి లీటర్‌కు రూ. 10 చొప్పున చార్జీ చెల్లించేలా నిబంధనలు రూపొందించారు. బస్తీల్లో వేసే బోర్‌వెల్స్‌కు ఒక్కోదానికి రూ. 1000, కాలనీల్లో వేసే బోర్‌వెల్స్‌లకు 3 వేల చొప్పున చార్జీలను చెల్లించేలా నిబంధనలను అమలు చేయనున్నారు. బోర్‌వెల్స్‌ల రిజిస్ట్రేషన్స్ కచ్చితం చేస్తూ..కేంద్ర జలశక్తి ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేస్తూ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పూర్తి స్థాయి చర్యలు చేపట్టనున్నారు. వాణిజ్య, వ్యాపార సముదాయాలు, గృహ సముదాయాలకు కచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి.. ప్రతి వాన నీటి బొట్టును ఒడిసి పట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. గ్రూప్ హౌసింగ్ సొసైటీలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు నో అబ్జెక్షన్ (ఎన్‌వోసీ) సర్టిఫికెట్ కోరడం నుంచి మినహాయింపు కల్పించారు. బోరు బావులకు ఫ్లో మీటర్లను అమర్చడం నుంచి వీరికి మినహాయింపు ఇచ్చారు. మొత్తానికి రోజువారీగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రతి నీటి చుక్క వినియోగానికి లెక్క తెలిసే విధంగా అధికారులు చర్యలు ప్రారంభించనున్నారు.

టీహబ్‌లో ఇండియా గ్రీన్ ఇన్నోవేషన్

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఏఐసీ) సహకారంతో టీ హబ్‌లో ఇండియా గ్రీన్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ నిర్వహణ పై ఆవిష్కరణలు చేసే వారిని ప్రోత్సహించేందుకు మూడో దశ స్ప్రార్క్‌ల్‌ను నిర్వహించారు. మొత్తం 220 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 20 మంది స్టార్టప్‌లు సస్టెయినబిలిటీ కోహర్ట్‌లో చేరడానికి ఎంపిక చేశారు. ఎంపికైన వాటిలో ఎర్త్‌టెక్ ఇండియా, అంబియేటర్ ప్రైవేట్ లిమిటెడ్, హుబెకో గ్రీన్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, రెవరెంట్ టెక్నాలజీస్, మైప్లాన్ 8, షీన్ సోలార్, జీరో కార్బన్ వన్, నెట్‌జీరో లివింగ్, విసార్జ్ సిస్టమ్స్, న్యూబో, థింక్ స్మార్ట్ టెక్నాలజీస్, సీఐ మెట్రిక్, గూడీబ్యాగ్‌లను ఎంపిక చేసినట్లు టీ హబ్ నిర్వాహకులు తెలిపారు.

దేశభక్తిని చాటేలా నేడు సైక్లింగ్ రైడ్

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం సైక్లింగ్ రైడ్ నిర్వహించనున్నట్లు ఫౌండర్ నందనూరి రవీందర్ తెలిపారు. సుచిత్ర డెకాథ్లాన్ నుంచి ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో దేశ భక్తిని చాటేలా ఈ రైడ్ ఉంటుందన్నారు. జాతీయ జెండాలతో సైక్లింగ్ ఆకట్టుకోనుందని తెలిపారు.

లీఫ్ కార్వింగ్ ఆర్ట్

అమీర్‌పేట్, ఆగస్టు 14: లీఫ్ కార్వింగ్ ఆర్ట్ ఆకులపై చక్కటి ఆకృతులను తీర్చిదిద్దడం నిజంగా అద్భుతం అనే చెప్పాలి. సనత్‌నగర్ జెక్‌కాలనీకి చెందిన వాణి రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రకోటపై జాతీయ జెండా రెపరెపలాడుతున్న ఆకారాన్ని రావి ఆకుపై వేసి ఆకట్టుకున్నారు.



స్త్రీ నిధి సంఘం సభ్యులకు చెక్కును అందజేస్తున్న మంత్రి సీతక్క

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వ్యవసాయ యూనివర్సిటీ,ఆగస్టు 14: ఆర్థిక, సామాజిక రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలని మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన స్త్రీనిధి 11వ రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలోనే అర్హత గల ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల బీమా అమలు చేస్తామని, ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబానికి రూ.10 లక్షలు, రుణమాఫీ అయ్యేందుకు గల జీవోలను అమలుచేస్తామన్నారు. పదేండ్ల క్రితం మహిళా ఆవేదనలు, మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులకు బాసటగా స్త్రీనిధి ప్రారంభించారని గుర్తుచేశారు. మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని మహారాష్ట్ర ,హర్యానా తదితర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారన్నారు. మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ ఏడాది (2024-25) వార్షిక ప్రణాళికకు రూ.2,520కోట్లుగా ఆమోదించిందన్నారు. వీటిలో గ్రామీణ సంఘాలకు రూ.1948, పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాలకు రూ.572 కోట్లు సర్వసభ్య సమావేశం ఆమోదించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య, అధికారులు కృష్ణభాస్కర్, ఉదయ్‌కుమార్, విద్యాసాగర్, స్త్రీనిధి డైరెక్టర్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఎస్‌బీఐ తదితర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఒక విధ్వంసం 1056 / 90 పుస్తకావిష్కరణ

అమీర్‌పేట, ఆగస్టు 14: పారిశ్రామికీకరణ, ఫార్మా ఎస్ఈజెడ్‌లు కాలుష్య కారకాలుగా గ్రామాలను ఎలా నాశనం చేస్తున్నాయో.. కడుపులో బిడ్డ మొదలు భూమి మీద సకల ప్రాణకోటిని ఎలా ధ్వంసం చేస్తున్నాయనే విషయ లోతులను స్పృశిస్తూ సుప్రీం కోర్టు రిట్ పిటీషన్ పై ప్రముఖ జర్నలిస్ట్, సమయమంత్రి చంద్రశేఖరశర్మ రచించిన 'ఒక విధ్వంసం 1056/90' పుస్తకావిష్కరణ బుధవారం అమీర్‌పేట్‌లోని హోటల్ మారీగోల్డ్‌లో జరిగింది. ప్రొ.హరగోపాల్ ఆవిష్కరించిన ఈ పుస్తక తొలి ప్రతిని ఆంధ్రజ్యోతి సంపాదకుడు డాక్టర్ కే శ్రీనివాస్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. విజయ్, సరస్వతి కవుల, జనచైతన్య పబ్లికేషన్స్ సీఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి ప్రారంభం

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): దేశంలోనే ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన కెనరా బ్యాంకు కొత్తగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కెనరా విద్యా జ్యోతి స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. బుధవారం నగరంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని జాతీయ షెడ్యూలు కులాల కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్‌బాబు ప్రారంభించారు.బ్యాంకు వ్యవస్థాపకులైన అంమెంబాల్ సుబ్బారావు పాయ్ స్మారకంగా కెనరా విద్యాజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించామని కెనరా బ్యాంకు సర్కిల్ హెడ్, జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,నేషనల్ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్‌బాబు, సభ్యులు జిల్లా శంకర్, కెనరా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 14 : నిరుద్యోగ షెడ్యూల్డు కులాల యువతీ, యువకులు, ట్రాన్స్‌జెండర్ల ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత డ్రైవింగ్ లైట్ మోటర్ వెహికల్(LMV), హెవీ మోటర్ వెహికల్(HMV) శిక్షణ 38 రోజులు కోర్సుల్లో శిక్షణ కాలం ముగిసిన అనంతరం పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందజేస్తారని తెలిపారు. హకీంపేట్‌లో ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం వసతి ఉంటుందని తెలిపారు. లైట్ మోటర్ వెహికిల్ లైసెన్స్ పొందుటకు వయస్సు 18 నుంచి 35 ఏండ్లు లోపు ఉండాలని విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, లర్నింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్(LLR)తో పాటు కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు విద్యార్హతల సర్టిఫికెట్లు, 3 పాస్‌ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హెవీ మోటర్ వెహికిల్ లైసెన్స్ పొందుటకు వయస్సు 20 నుంచి 35 ఏండ్లలోపు కలిగి ఉండాలని, కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, లైట్ మోటర్ వెహికిల్ లైసెన్స్ పొంది ఉండాలని, కులం, ఆదాయం సర్టిఫికెట్లు,ఆధార్‌కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లు, 3 పాస్‌ఫోటోలు దరఖాస్తులతో జత చేయాలని సూచించారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లో ఈ నెల 20 వ తేదీ లోపు అందజేయాలని కోరారు.

కవి గరిమెళ్ల సత్యనారాయణకు నివాళి

గరిమెళ్ల సత్యనారాయణకు నివాళుర్పించిన కోలేటి దామోదర్ గుప్తా

ముషీరాబాద్, ఆగస్టు 14: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు, కవి గరిమెళ్ల సత్యనారాయణ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ తెలంగాణ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొని గరిమెళ్ల సత్యనారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, యంవీ రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాను రద్దు చేయండి

మేయర్, కమిషనర్‌కు ఎంఐఎం కార్పొరేటర్ల ఫిర్యాదు

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చి జీహెచ్ ఎంసీపై రుద్దడం సమంజసం కాదని, జీహెచ్ఎంసీ యాక్ట్‌లో ఇలాంటి వ్యవస్థ లేదని, తక్షణమే హైడ్రాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలిని బుధవారం ఎంఐఎం కార్పొరేటర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. హైడ్రాపై మేయర్‌కు ఈ సందర్భంగా ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ యాక్ట్‌లో హైడ్రా లేదని, హైడ్రా వింగ్‌కు జీహెచ్ఎంసీ యంత్రాంగాన్ని వాడుతున్నారని మండిపడ్డారు. వెంటనే పాలక మండలిలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని కార్పొరేటర్లు మేయర్‌కు విన్నవించారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

ఎకోపార్క్ పనులపై కదిలిన యంత్రాంగం

ఎనిమిది నెలలుగా నిలిచిన డెక్, వాకింగ్ ట్రాక్ పనులు

సిటీబ్యూరో, ఆగస్ట్ 14(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. హైదరాబాద్ పర్యాటకానికే తలమానికమైన కొత్వాల్‌గూడ ఎకో పార్క్‌లో పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఎనిమిది నెలలుగా హెచ్ఎండీఏ పరిధిలోని ఈ పార్క్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై అధికారులు ఎట్టకేలకు దృష్టి సారించారు. దాదాపు 125 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పార్కులో గత ప్రభుత్వ హయాంలోనే 75శాతానికి పైగా పనులు చేపట్టింది. దాదాపు 25శాతం పనులు పెండింగ్‌లో ఉండగా ఎన్నికల కారణంగా నిలిచిపోయాయి. అయితే ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలలుగా గడుస్తున్నా... ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వం కనీసం ఒక్క సమీక్ష కూడా చేయలేదు. దీంతో అధికారులు కూడా పనులను పక్కన పెట్టేశారు. ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ వంటి పనులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. 2022లో ఈ ప్రాజెక్టును ప్రారంభించగా, మెజార్టీ పనులను వేగంగా పూర్తి చేసింది. కానీ మిగిలిన పనులను పూర్తి చేసేందుకు ఇప్పటికీ ఇన్నాళ్లు ఆగిన అధికారులు తాజాగా టెండర్లు పిలిచారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి గల కారణాలపై పలు విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చ జరిగింది. దీంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. మహానగర జంట జలాశయాలకు సమీపంలో ఉన్న ఎకో టూరిజం పార్క్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు. హైదరాబాద్ పర్యాటకానికి వన్నె తెచ్చే ఈ ప్రాజెక్టును భారీ వ్యయంతో చేపట్టింది. పచ్చని పరిసరాలు, అతి పెద్ద పక్షిశాల, అక్వేరియంతోపాటుగా వినోద కేంద్రంగా తీర్చిదిద్దారు. కొత్వాల్‌గూడ ఎకో పార్క్ అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. ఐవరీ, అక్వేరియం, బోర్డు వాక్స్, ల్యాండ్ స్కేపింగ్, వీకెండ్ క్యాపింగ్ వంటి సదుపాయాలతో ఈ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి పెరగనుంది.

రాష్ట్రంలో విద్యావిధానం అధోగతి

హైదరాబాద్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యావిధానం అధోగతి పాలైందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇటీవల ప్రకటించిన నేషనల్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్ర యూనివర్సిటీలు చివరి వరుసలో ఉండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. వంద లోపు ర్యాంకుల్లో ఉస్మానియా మినహా వేరే వర్సిటీ లేకపోవడం బాధాకరమన్నారు. వర్సిటీల్లో ఖాళీలు భర్తీ చేస్తామన్న ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. వీసీలను నియమించి.. యూనివర్సిటీల్లో ఖాళీలు భర్తీ చేసి, స్కూళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ రుణమాఫీ కాల్ సెంటర్‌కు 65 వేల కాల్స్ వచ్చాయని, రచ్చబండ అప్లికేషన్స్‌తో కలిపి మొత్తం 80 వేల మంది రైతులు ఫిర్యాదులు చేశారని తెలిపారు.

విద్యార్థి దశలోనే లక్ష్యం పెట్టుకోవాలి

సిటీబ్యూరో, ఆగస్ట్ 14(నమస్తే తెలంగాణ) : ఉన్నత జీవితాన్ని పొందేందుకు విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంటేనే అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా. జి. రామేశ్వర్‌రావు అన్నారు. గచ్చిబౌలిలోని ఏస్కీ క్యాంపస్‌లో స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ఏర్పాటు చేసిన ఇండస్ట్రీ అండ్ అకాడమియా ఇంటరాక్షన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువతకు ఉపాధిని కల్పించే అనేక కోర్సులతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏస్కీ క్యాంపస్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, టాటా ప్రాజెక్ట్స్ నుంచి డా. శంకర్, ఇండియా స్టార్టప్ ఫౌండేషన్ కో ఫౌండర్ శేషాద్రి వంగల, గ్లోబల్ గ్రూప్ డిప్యూటీ సీఈవో వేణుమాధవ్ గొట్టుపుల్ల, ఏడీబీ నుంచి శ్రీధర్, ఐసీఏ నుంచి రోహిత్ భరద్వాజ్, స్ప్రింట్ రే సునీత లంకా, టీఎంటీ నుంచి రాజీవ్ బిష్ట్, ఫ్యాకల్టీ సభ్యులు అలిగే రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

కులగణన ప్రారంభించాలి

చిక్కడపల్లి,ఆగస్టు14 : రాష్ట్రంలో కులగణన వెంటనే ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్‌తో కలిసి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో జరిగిన అత్యున్నత సమావేశంలో దేశ వ్యాప్తంగా కులగణన ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడం మంచి పరిణామమన్నారు. రాహుల్ గాంధీ కులగణన చేపడితేనే బీసీ సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుందని పదేపదే చెబుతున్నారని కానీ ఆచరణ పెట్టడంలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి కులగణన వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో అయిలి వెంకన్న గౌడ్, ఏలికట్టే విజయ్‌కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్, బాలగాని వెంకటేశ్, ఇంద్రమ్ రచక పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయాలి

ఖైరతాబాద్,ఆగస్టు 14 : ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఏర్పడిన ఎమ్మార్పీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల సుధీర్ఘ పోరాటం ద్వారానే సుప్రీంకోర్టు వర్గీకరణ తీర్పుఇచ్చిందని ఓ వైపు చెబుతూనే, వర్గీకరణకు ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రులు అమిత్‌షా, కిషన్ రెడ్డి వల్లనే సాధ్యమైందని చెప్పడంతో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మాదిగ జాతిని మతవాద బీజేపీ వైపు మళ్లించాలని ఆయన ప్రయత్నిస్తున్నారన్నారు. వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందాలంటే మందకృష్ణ భేషజాలకు పోకుండా ఎమ్మార్పీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనంచేయాలని కోరారు. సమావేశంలో మైస ఉపేందర్, గడ్డ యాదయ్య, బొంకూరి సురేందర్ సన్నీ, బాలరాజు, సంతోష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాటు నివారణకు అవగాహన

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్లతో బుధవారం ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కుక్కల నివారణ చర్యల్లో భాగంగా విద్యాసంస్థలు, మహిళా సంఘాలు, రెసిడెన్షియల్ అసోసియేషన్ ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు షెడ్యూల్‌ను తయారు చేయాలన్నారు. కుక్కల బెడద ఉన్న వారు జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్, కాల్‌సెంటర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కుక్కల ఫీడింగ్ ఇచ్చే ఏజెన్సీలను గుర్తించాలని కమిషనర్ సూచించారు. అర్బన్ లూ సంస్థకు పీపీపీ పద్ధతిలో టాయిలెట్స్ నిర్మాణానికి 23 ప్రదేశాల్లో అనుమతి ఇచ్చామని, ఇప్పటి వరకు వాటి నిర్మాణాలు చేపట్టకపోవడానికి గల కారణాలను తెలుసుకోవాలన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సిటీబ్యూరో, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : నల్ల కుంట ఫీవర్ ఆస్పత్రిని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో డెంగ్యూ కిట్‌లు, ఎలిజా, ఆర్‌డీఎస్ తగినంత ఉన్నాయా.. రోజుకు ఎన్ని టెస్ట్‌లు నిర్వహిస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ ఆసుపత్రిలోని ఐసీయూ వార్డ్, ఫార్మసీ, హాజరు రిజిస్టర్, ఫార్మసీలోని మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం బండ్లగూడ పట్టణ ప్రాథమిక ఆసుపత్రిని సందర్శించి ఆపరేషన్ థియేటర్, డ్రెస్సింగ్ రూం, ఫార్మసీని సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆసుపత్రి సిబ్బంది వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యా, వైద్య సేవలను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, ఫీవర్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ జయ శ్యామ్ పాల్గొన్నారు.

*78వ స్వాతంత